క్లుప్తంగా

రేపు విద్యుత్ అంతరాయం

కాకినాడ సిటీ: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో సోమవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు వెంకటరత్నపురం, సత్య ప్రసన్న నగర్, కల్పనసెంటర్, ఆనంద్‌భారతి ఏరియా, రెల్లివీధి, బ్యాంకుపేట తదితర ప్రాంతాలకు, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సినిమారోడ్డు, బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్ ప్రాంతం, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఏరియా, పోలీస్‌లైన్ వీధి, శేషబ్‌గల్లీ, మయూరి థియేటర్ వెనుక ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

గుండె వ్యాధులపై అవగాహన

బాలాజీచెరువు: స్థానికంగా ఓ హోటల్‌లో హెల్త్ అవేర్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అఖిల భారత సీసీఆర్ చైర్మన్ డాక్టర్ చక్రరావు హాజరై మాట్లాడారు. గుండె వ్యాధులపై అవగాహన కల్పించారు. హెల్త్ అవేర్‌నెస్ అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు, డాక్టర్లు ప్రేరణ, శివతేజ పాల్గొన్నారు.

ఘనంగా పశు వైద్య దినోత్సవం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. తిమ్మాపురం పశు వైద్యుడు, జాతీయ ఉత్తమ పశువైద్య శస్త్రచికిత్సా అవార్డు గ్రహీత తలాటం సురేష్‌ను ఘనంగా సత్కరించారు. అడబాల రత్నప్రసాద్, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

ఆలోచనలకు పదును పెట్టాలి

కాకినాడ రూరల్: మానసికంగా పరిపక్వత చెందాలంటే ప్రతి ఒక్కరూ ఆలోచనలకు పదును పెట్టాలని ప్రముఖ మానసిక విశ్లేషకుడు ఏపీజే విను అన్నారు. సర్పవరం జంక్షన్‌లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస సమాజ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్నప్రసాద్, డాక్టర్ వేదుల శ్రీరామశర్మ, రేలంగి బాపిరాజు, అడబాల సత్యనారాయణ, పార్థసారథి పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు అవసరం

కరప: వేసవిలో జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు అన్నారు. గొడ్డటిపాలెంలో శనివారం ఉపాధి పనులను పరిశీలించి, కూలీలకు సూచనలు చేశారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కరపలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చారు.

క్రీడా పరికరాల అందజేత

నాగమల్లితోట జంక్షన్: భూపతిపాలెం గురుకుల పాఠశాలకు కాకినాడ హరీష్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు టి.హరీష్ రెండు బాస్కెట్‌బాల్ బోర్డులను శనివారం బహూకరించారు. పూర్వ విద్యార్థులు సునీల్, నాగేశ్వరరావు, కాటన్, సుబ్బారావు, రత్నాకర్ పాల్గొన్నారు.

5న కాకినాడలో ముగింపు సభ

బోట్‌క్లబ్: బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాల ముగింపు సభ మే 5న కాకినాడలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. స్థానిక ట్రెజరీ కాలనీలో శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

రూ.కోటితో శివాలయం ఆధునీకరణ

కరప: నడకుదురులోని రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని గ్రామస్తుల వినతి మేరకు రూ.కోటి నిధులతో ఆధునీకరించామని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు తెలిపారు. శనివారం నడకుదురులో పునర్నిర్మించిన శివాలయంలో బాలాత్రిపురసుందరీ సమేత రామలింగేశ్వర స్వామివార్ల పునః ప్రతిష్ఠా మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీర్ణోద్ధరణకు చేరిన ఈ శివాలయం, ఇతర గ్రామాల్లోని ఆలయాల పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వివరించి, నిధులు మంజూరు చేయించామన్నారు. పునర్నిర్మించిన శివాలయంలో మే నెల 3న జరిగే బాలాత్రిపురసుందరి, రామలింగేశ్వర స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠకు ముందు ఐదు రోజుల పూజా కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. శ్రీవిద్యాపూర్ణ తీక్షాపరులు యేలూరిపాటి ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణతో పూజలు నిర్వహించగా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులతో పాటు గ్రామానికి చెందిన 18 దంపతులు పాల్గొన్నారు.



నడకుదురు శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య దంపతులు

గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాసంకల్ప పఠనం, పంచగవ్యం, రక్షాబంధన ధారణ, దీక్షాధారణ, గ్రామోత్సవం, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, ధ్వజారోహణ, జలాధివాసం తదితర పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మిడి రత్నకుమార్, ఈఓ మోర్త మురళీవీరభద్రరావు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు త్రిపురారి ఆదిలక్ష్మి, సర్పంచ్ దేగల లలితకుమారి, ఎంపీటీసీ సభ్యులు ముమ్మిడి బుచ్చిరాజు, పైలా రామతులసి, ఏఎంసీ చైర్మన్ కర్నాసుల సీతా రామాంజనేయులు, పారిశ్రామిక వేత్త ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు మరింత వేగవంతం

● ఏడీసీ నాగ నరసింహారావు

కాకినాడ: కొమరగిరి లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని స్థానిక నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. శనివారం ఆయన గృహ నిర్మాణ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, నగరపాలక సంస్థ అధికారులతో కలసి కొమరగిరి లేఅవుట్‌ను పరిశీలించారు. రోజూ మూడు వేల ఇటుకల తయారీ సామర్థ్యం కలిగిన రెండు బ్రిక్ ఇండస్ట్రీలను ఏడీసీ చూసి ఇటుకల నాణ్యతను తనిఖీ చేశారు. అక్కడ నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఆర్వో ప్లాంట్ పనులను వేగవంతంగ చేయాలని ఆదేశించారు. త్వరలోనే గృహ నిర్మాణ శాఖ మంత్రి కొమరగిరి లేఅవుట్‌ను సందర్శించనున్నారని చెప్పారు. మంత్రి పర్యటన నేపథ్యంలో లేఅవుట్‌లో నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ డీఈ కె.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొమరగిరి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

పూడికతీత పనుల పరిశీలన

నగరంలోని కాలువల్లో పూడికతీత పనులను ఏడీసీ నాగ నరసింహారావు పర్యవేక్షించారు. జగన్నాథపురం 17వ డివిజన్ పరిధిలోని ఉమెన్స్ కళాశాల ప్రాంతంలో డి సిల్టేషన్ పనులు పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం 20వ డివిజన్‌లోని మేకల కబేళా ప్రాంతంలో పూడిక తీత పనులను పరిశీలించారు. వర్షాలు పడేలోగా అన్ని కల్వర్టులు, మేజర్ డ్రైన్లలో పూడికతీతలు తొలగించాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణను ఆయన పరిశీలించారు.

సీఎం జగన్ పాలనకు బ్రహ్మరథం

● కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న అన్నారు. స్థానిక 9వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. తొలుత ఇంటింటికీ వెళ్లి ప్రజా సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరిగి సీఎంగా జగన్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని పథకాలతో పాటు పారదర్శకతకు పెద్దపీట వేస్తూ వినూత్న పాలనా సంస్కరణలతో సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. పాదయాత్రలో సమస్యలను చూసి వాటిని పరిష్కరించేందుకు నవరత్న పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. కాకినాడలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాలనపై ప్రజలు ఎంతో విశ్వాసాన్ని కనబరుస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు కంపర బాబి, పలక సూర్యకుమారి, కర్రి శైలజ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు స్పందన

కరప: మండలంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పోట్నీడి భీమేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్ తదితరులు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక అమలు చేసిన పథకాలపై వివరించారు. యజమానుల అంగీకారంతో ఇంటి తలుపులకు జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అతికించారు. కరప, గొడ్డటిపాలెం, నడకుదురు, అరట్లకట్ట తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 1.15 లక్షల కుటుంబాలు ఉండగా ఇంతవరకూ 85 వేల కుటుంబాలు తమ ఫోన్ల నుంచి మిస్డ్ కాల్స్ చేసి జగనన్నకు మద్దతు తెలిపారన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, నగరాధ్యక్షురాలు శివప్రసన్న

మరింత 'స్మార్ట్'గా కాకినాడ

కాకినాడ: కాకినాడ స్మార్ట్ సిటీని పటిష్ట ప్రణాళికతో మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్మార్ట్ సిటీ సీఈవో, ఎండీ, కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అన్నారు. దేశంలోని స్మార్ట్‌సిటీ నగరాల అభివృద్ధి, మనుగడకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఆకర్షణీయ నగరాల సీఈఓలతో 27, 28 తేదీల్లో ఛండీగఢ్‌లో సదస్సు నిర్వహించారు. దీనిని కేంద్ర పట్టణ గృహనిర్మాణ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసింది. ఇందులో సీఈవో డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల పాల్గొని మాట్లాడుతూ విపత్తుల నివారణ- తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాలపై త్వరలోనే కార్యాచరణ చేస్తామని కమిషనర్ శనివారం తెలిపారు.



స్మార్ట్‌సిటీ సదస్సులో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కళలను ప్రోత్సహిద్దాం..

కాకినాడ రూరల్: సంప్రదాయ నృత్య కళను భావితరాలకు అందిద్దామని నాట్యాచార్య, జిల్లా నృత్య సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు టీవీఎస్ వరప్రసాద్ అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ నృత్య దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నృత్యం అనేది ఒక కళా రూపకమే కాదని, ఆహ్లాదకరమైన ఫిట్నెస్ వ్యాయామాలలో ఒకటన్నారు. ఆధ్యాత్మికవేత్త డాక్టర్ వేదుల శ్రీరామశర్మ మాట్లాడుతూ నృత్యం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్కృతులలో ఒక కళారూపమన్నారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో వరప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రేలంగి బాపిరాజు, పార్థసారథి, ఎస్.శ్రీనగేష్, అడబాల సత్యనారాయణ, రాజా, రాఘవరావు పాల్గొన్నారు.



నాట్యాచార్య వరప్రసాద్‌ను సత్కరిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

సైనికుల పోరాటం ఎనలేనిది

బోట్‌క్లబ్: దేశ రక్షణలో సైనికుల పోరాటం ఎనలేనిదని విశిష్ట సేవా మెడల్ గ్రహీత, విశ్రాంత ఆర్మీ మేజర్ జ్యోతుల వెంకటప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక రోటరీ హాల్‌లో రోటరీ గోల్డెన్ జూబ్లీలో ఆధ్వర్యంలో ఆయన్ని సత్కరించారు. ప్రజలు ఇస్తున్న ప్రోత్సాహంతోనే భారత రక్షణ దళం అద్భుతాలను సృష్టిస్తూ దేశ గౌరవాన్ని ఇనుమడింప జేస్తుందన్నారు. దేశ రక్షణ, గౌరవం, సంక్షేమం వంటి విషయాలకు ఇండియన్ ఆర్మీ ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం అర్పించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. యుద్ధ భూమిలో ఉన్నప్పుడు దేశానికి విజయం అందించాలన్న ఏకైక లక్ష్యంతో సమైక్యంగా పోరాడతామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వడ్డాది ఆదిత్య, బ్లడ్ బ్యాంక్ చైర్మన్ టీవీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత మేజర్ వెంకటప్రసాద్‌ను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

కొత్త కార్యవర్గం ఎన్నిక

బాలాజీచెరువు: ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ టెలీ కమ్యూనికేషన్స్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) కాకినాడ చాప్టర్ చైర్మన్ జేఎన్‌టీయూకే ఈసీఈ ప్రొఫెసర్ డాక్టర్ బీటీ కృష్ణ అధ్యక్షతన స్టూడెంట్ చాప్టర్ కార్యవర్గ ఎన్నిక శనివారం జరిగింది. ప్రెసిడెంట్‌గా బి.అభిషేక్‌రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా వై.కౌశిక్‌రెడ్డి, కె.దేవేందర్‌రెడ్డి, కార్యదర్శిగా ఇ.శ్రీరామ్, కోశాధికారిగా ఎస్‌వీ లక్ష్మణ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు నియమించారు. సభ్యులను వీసీ డాక్టర్ ప్రసాదరాజు అభినందించారు.



కొత్త కార్యవర్గంతో చైర్మన్ కృష్ణ

రాయితీకి నేటితో గడువు ముగింపు

కాకినాడ: ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఐదు శాతం రాయితీపై చెల్లించేందుకు ఆదివారం ఒకరోజు మాత్రమే గడువు ఉందని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ చెప్పారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం పన్నును ఏకమొత్తంగా ఏప్రిల్ 30వ తేదీలోపు చెల్లించేవారికి ఐదు శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ పన్ను చెల్లింపు కౌంటర్లు తెరిచి ఉంటాయన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కాకినాడ రూరల్: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యకారుల నైపుణ్యాభివృద్ధిపై కాకినాడ ఎస్ఐఎఫ్‌టీలో మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. విశాఖపట్నం సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రెనింగ్ (సిఫ్‌నెట్) యూనిట్ అధికారులు శిక్షణ అందించారు. ఈ శిక్షణకు 20 బోట్ల ఓనర్లు, డ్రైవర్లు హాజరయ్యారు. మత్స్యశాఖ జిల్లా అధికారి పి.సత్యనారాయణ, ఎస్ఐఎఫ్‌టీ ఏడీ పెద్దిబాబు, మత్స్యశాఖ ఏడీ సుమలత, ఎఫ్‌డీఓ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్పీ హైస్కూల్‌లో మెరిట్ విద్యార్థులకు దాతలు చేయూత అందించారు. పెనుగుదురుకు చెందిన ధవిశేశ్వరపు చంద్రశేఖరరావు కరప హైస్కూల్‌లో 1967–68లో ఎస్ఎస్ఎల్‌సీ చదివారు. గతేడాది చంద్రశేఖరరావు, అతని భార్య లక్ష్మీనాగరత్నం మరణించడంతో వారి జ్ఞాపకార్థం ఎన్ఆర్ఐ అయిన వారి కుమారుడు హేమంత్‌కుమార్, కుమార్తె అరుణాదేవిలు 16 మంది పేద విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున అందించారు. విశ్రాంత ఎస్‌బీఐ ఉద్యోగులు ధవిశేశ్వరపు రాజశేఖర్, డి.వెంకటేశ్వరరావు, హెచ్ఎం యు.లీలా మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కరప హైస్కూల్‌లో విద్యార్థులకు సాయం అందిస్తున్న దాతలు

టీడీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

కాకినాడ: ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్న బీజేపీతో జత కట్టేందుకు చంద్రబాబు తహతహలాడుతున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త అబ్దుల్ బషీరుద్దీన్ అన్నారు. శనివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ అంశంపై టీడీపీలోని ముస్లిం మైనార్టీలు ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. మతతత్వ బీజేపీతో చెలిమి చేసేందుకు సిద్ధపడుతున్న టీడీపీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.



అబ్దుల్ బషీరుద్దీన్

ఉద్యోగ సంఘాల ధర్నా

కాకినాడ సిటీ: ఏపీజేఏసీ అమరావతి, రాష్ట్ర కమిటీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా మలిదశ పోరాట కార్యక్రమంలో నాల్గో ధర్నా శనివారం ధర్నాచౌక్ వద్ద నిర్వహించారు. ఇందులో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు, పెన్షనర్లు పాల్గొన్నారు. 1న జీతాలు, పెన్షన్లు అందించాలని, బాకీ డీఏలు మంజూరు చేయాలని జేఏసీ చైర్మన్ పితాని త్రినాథరావు, ఉద్యమ నాయకులు సంసాని శ్రీనివాస్, కె.పద్మనాభం అన్నారు.

ప్రతిభకు కృషి తోడైతే విజయం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. జేఎన్‌టీయూ కళాశాల క్రీడా దినోత్సవ వేడుకలు శనివారం వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతిభకు కృషి తోడైతే సాధించలేనిది ఏదీ లేదన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఉత్తమ ప్రతిభ కనబర్చాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు ఎస్పీ బహుమతులు అందించారు. అనంతరం ఎస్పీని సత్కరించారు. రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్

నేటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి మే 6వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వెంకన్నను చూసి.. మది మురిసి

బోట్‌క్లబ్: స్థానిక పళ్లంరాజు నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం 800 మూరల మల్లెలతో స్వామి వారిని అలంకరించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. వైశాఖ మాసం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసినట్లు ఆలయ అర్చకుడు ఇందవిల్లి నారాయణాచార్యులు తెలిపారు.

కాకినాడ రూరల్: సర్పవరం క్షేత్రంలో శ్రీభావనారాయణస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారి కల్యాణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, కమిటీ సభ్యులు, భక్తులు, ఆలయ ఈఓ భీమ శంకరరావు పాల్గొన్నారు.



మల్లె పువ్వులతో వేంకటేశ్వర స్వామికి అలంకరణ

బీసీలకు సామాజిక గౌరవం

కాకినాడ సిటీ: టీడీపీతోనే బలహీన వర్గాలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గౌరవం దక్కిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం స్థానిక సూర్యకళా మందిర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో బీసీ ఐక్య కార్యాచరణ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే బీసీల రిజర్వేషన్లు పెంచుతామన్నారు. నాయకులు కొల్లు రవీంద్ర, యనమల రామకృష్ణుడు, కిమిడి కళావెంకటరావు, రెడ్డి సుబ్రహ్మణ్యం, కేఎస్ జవహర్, బండారు సత్యనారాయణమూర్తి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు